8న రింకూ నిశ్చితార్థం

జాన్‌పూర్ (యూపీ): టీమ్‌ఇండియా యువ క్రికెటర్ రింకూ సింగ్ త్వరలోనే పెండ్లిపీటలెక్కనున్నాడు. ఉత్తరప్రదేశ్‌లోని మచ్లిషెహర్ లోక్‌సభ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సమాజ్‌వాదీ పార్టీ ఎంపీ ప్రియా సరోజ్‌తో రింకూ ఏడడుగులు వేయనున్నాడు. ఈనెల 08న వీరిద్దరి నిశ్చితార్థం జరుగనుంది. ఈ విషయాన్ని ప్రియా సరోజ్ తండ్రి, మాజీ ఎంపీ తుఫానీ సరోజ్ తెలిపారు. జూన్ 08న లక్నోలోని ఓ హోటల్‌లో తమ బంధుమిత్రుల సమక్షంలో రింకూ-ప్రియ ఎంగేజ్‌మెంట్ జరుగనుండగా నవంబర్ 18న వారణాసిలోని తాజ్ హోటల్‌లో పెండ్లికి ముహూర్తం నిశ్చయించినట్టు తుఫానీ తెలిపారు.

లవ్లీనా బాక్సింగ్ అకాడమీ

రేపు ప్రారంభించనున్న అసోం సీఎం

గువహతి: టోక్యో ఒలింపిక్స్‌లో పతకం గెలిచి జాతీయ, అంతర్జాతీయ వేదికలపై సత్తా చాటుతున్న అసోం అమ్మాయి లవ్లీనా బోర్గోహెయిన్ తన కల సాకారం దిశగా కీలక ముందడుగు వేసింది. తమ ప్రాంతంలో యువ బాక్సర్లకు అంతర్జాతీయ వసతులతో కూడిన మెరుగైన శిక్షణ ఇచ్చేందుకు గాను సొంతగా బాక్సింగ్ అకాడమీని ఏర్పాటు చేసింది. ఈనెల 03 (మంగళవారం)న అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ 'లవ్లీనా బాక్సింగ్ అకాడమీ'ని ప్రారంభించనున్నారు. ఈ మేరకు లవ్లీనా స్పందిస్తూ.. 'ఈ అకాడమీ ఒక శిక్షణ కేంద్రం మాత్రమే కాదు. రింగ్‌లో దిగి సత్తా చాటాలనుకుంటున్న ఎంతోమంది అసోం యువ బాక్సర్ల కల కూడా నెరవేరనుంది. ఇక్కడ ఒక్క బాక్సింగ్ ఆట గురించే మెలుకువలు నేర్పడమే గాక విజయాలు సాధించేందుకు అవసరమైన క్రమశిక్షణ, అచంచలమైన క్రీడా స్ఫూర్తిని ఇది నేర్పిస్తుంది' అని తెలిపింది.



పుణె బోణీ

అహ్మదాబాద్: అల్టిమేట్ టేబుల్ టెన్నిస్ (యూటీటీ) ఆరో సీజన్‌లో పీబీజీ పుణె జాగ్వర్స్ బోణీ కొట్టింది. ఆదివారం అహ్మదాబాద్‌లోని ఎకా ఎరీనా వేదికగా జరిగిన మ్యాచ్‌లో పుణె జాగ్వర్స్.. 9-6తో యూ ముంబా టీటీపై విజయం సాధించింది. పురుషుల సింగిల్స్‌లో లిలియన్ బార్డెట్.. 2-1తో అల్వారొపై, మహిళల సింగిల్స్‌లో బెర్నడెట్.. 2-1తో మెప్రెఫ్‌ను ఓడించి ముంబైకి శుభారంభం అందించారు. కానీ మిక్స్‌డ్ డబుల్స్‌లో బెర్నెడెట్/ఆకాశ్ పాల్ ద్వయం.. 1-2తో మెప్రెఫ్/అనిర్బన్ చేతిలో ఓడారు. మరో పురుషుల సింగిల్స్ పోరులో ఆకాశ్.. 1-2తో అనిర్బన్ చేతిలో ఓడిపోగా కీలకమైన రెండో మహిళల సింగిల్స్‌లో రీతా.. 3-0తో స్వస్తికను ఓడించి పుణెకు విజయాన్ని కట్టబెట్టింది.

స్పానిష్ గ్రాండ్ ప్రి విజేత పియాస్ట్రి

స్పెయిన్: స్పానిష్ గ్రాండ్ ప్రిక్స్‌లో మెక్‌లారెన్ డ్రైవర్లు దుమ్మురేపారు. ఆస్ట్రేలియా కుర్రాడు ఆస్కార్ పియాస్ట్రి తొలిస్థానంతో సత్తా చాటగా లాండొ నొరిస్ (బ్రిటన్) రెండో స్థానంలో నిలిచాడు. ఆదివారం మొంట్‌మెలొ (స్పెయిన్)లో జరిగిన ఫైనల్ రేసును పియాస్ట్రి.. 66 ల్యాప్స్‌ను 1:32:57.375 నిమిషాల్లో పూర్తిచేసి ఈ సీజన్‌లో ఐదో టైటిల్‌ను ఖాతాలో వేసుకున్నాడు. రెడ్‌బుల్ డ్రైవర్ వెర్‌స్టెపెన్.. పదో స్థానంలో నిలవడం గమనార్హం.

ముంబైపై కింగ్స్ ఉత్కంఠ విజయం

ఫైనల్‌కు పంజాబ్

శ్రేయాస్ కెప్టెన్ ఇన్నింగ్స్ ● ఈనెల 3న ఆర్‌సీబీతో ఫైనల్ పోరుకు అర్హత

అహ్మదాబాద్: ఐపీఎల్-18 సీజన్ ఆసాంతం అద్భుతంగా రాణిస్తున్న పంజాబ్ కింగ్స్ తొలి క్వాలిఫయర్‌లో ఓడినా రెండో క్వాలిఫయర్‌లో అదరగొట్టింది. ఆదివారం అహ్మదాబాద్ వేదికగా ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్‌లో ఆ జట్టు 5 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించి ఫైనల్‌కు అర్హత సాధించింది. ముంబై నిర్దేశించిన 204 పరుగుల లక్ష్యాన్ని ఆ జట్టు.. 19 ఓవర్లలో 5 వికెట్లు నష్టపోయి ఛేదించింది. శ్రేయాస్ అయ్యర్ (41 బంతుల్లో 87*, 5 ఫోర్లు, 8 సిక్సర్లు) కెప్టెన్సీ ఇన్నింగ్స్‌కు తోడు నెహల్ వధెర (48), జోష్ ఇంగ్లిస్ (38) ఆ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించారు. వరుణుడి ఆటంకంతో రెండు గంటల పాటు ఆలస్యంగా మొదలైన మ్యాచ్‌లో టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన ఆ జట్టు.. నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 203 పరుగుల భారీ స్కోరు చేసి ప్రత్యర్థి ఎదుట భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది. ముంబై జట్టులోని హైదరాబాదీ కుర్రాడు తిలక్ వర్మ (29 బంతుల్లో 44, 2 ఫోర్లు, 2 సిక్సర్లు) బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకొచ్చి మెరుపులు మెరిపించాడు. సూర్యకుమార్ యాదవ్ (26 బంతుల్లో 44, 4 ఫోర్లు, 3 సిక్సర్లు) మరోసారి రెచ్చిపోగా జానీ బెయిర్ స్టో (24 బంతుల్లో 38, 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), నమన్ ధీర్ (18 బంతుల్లో 37, 7 ఫోర్లు) దూకుడుగా ఆడారు. ఈ విజయంతో పంజాబ్ మంగళవారం రాయల్ చాలెంజర్స్ బెంగళూరుతో టైటిల్ పోరులో అమీతుమీ తేల్చుకోనుంది.

తిలక్, సూర్య దూకుడు

టాస్ గెలిచిన పంజాబ్ సారథి శ్రేయాస్ అయ్యర్ మరో ఆలోచన లేకుండా బౌలింగ్ ఎంచుకున్నాడు. ఆరంభంలో పంజాబ్ బౌలర్లు అతడి నమ్మకాన్ని నిలబెట్టినా తర్వాత గతి తప్పారు. గత మ్యాచ్‌లో అర్ధ శతకంతో రాణించిన రోహిత్ శర్మ (8).. పంజాబ్‌తో కీలక పోరులో తేలిపోయాడు. స్టోయినిస్ వేసిన మూడో ఓవర్‌లో అతడు.. విజయ్‌కుమార్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. సాధారణంగా బ్యాటింగ్ ఆర్డర్‌లో నాలుగో స్థానంలో వచ్చే తిలక్‌ను ముంబై.. వ్యూహం మార్చి ముందుగా పంపించింది. జట్టు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని తిలక్ వమ్ముచేయలేదు. ఓపెనర్ బెయిర్ స్టోతో కలిసి ముంబై స్కోరుబోర్డును ఉరకలెత్తించాడు. ఎదుర్కొన్న రెండో బంతినే సిక్సర్‌గా మలిచాడు. అర్ష్‌దీప్ వేసిన మరుసటి ఓవర్‌లో బెయిర్ స్టో రెండు బౌండరీలు రాబట్టాడు. అజ్మతుల్లా ఐదో ఓవర్లో అతడు.. 4, 6తో రెచ్చిపోవడంతో పవర్ ప్లే ముగిసేసరికి ముంబై 65/1గా నిలిచింది. కానీ ఆ తర్వాతి ఓవర్‌లోనే విజయ్‌కుమార్.. బెయిర్ స్టోను ఔట్ చేయడంతో ముంబై రెండో వికెట్ కోల్పోయింది. దీంతో తిలక్‌కు సూర్య జతకలవడంతో ముంబై స్కోరుబోర్డు రాకెట్ వేగాన్ని తలపించింది. ఈ ఇద్దరూ పంజాబ్ బౌలర్లను ఉతికారేస్తూ ఒక్కో ఓవర్‌కు 10 పరుగులు తగ్గకుండా దండుకున్నారు. ఈ జోడీ దూకుడుగా ఆడి 42 బంతుల్లోనే 72 పరుగులు జతచేయడం విశేషం. ప్రమాదకరంగా మారుతున్న ఈ ద్వయాన్ని చాహల్ విడదీశాడు. అతడు వేసిన 14వ ఓవర్లో సూర్య.. 4, 6 బాదినా ఐదో బంతికి వధెరకు క్యాచ్ ఇచ్చి ఔట్ అయ్యాడు. ఆ తర్వాత రెండు బంతుల వ్యవధిలోనే తిలక్.. జెమీసన్ బౌలింగ్‌లో ప్రియాన్స్‌కు క్యాచ్ ఇవ్వడంతో ముంబై నాలుగో వికెట్ కోల్పోయింది. ముంబై సారథి హార్దిక్ (15) నిరాశపరిచినా ఆఖర్లో నమన్ బౌండరీలతో రెచ్చిపోయాడు.

అయ్యర్ సూపర్

భారీ లక్ష్యాన్ని ఛేదించేందుకు బరిలోకి దిగిన పంజాబ్.. బౌల్ట్ వేసిన ఇన్నింగ్స్ మూడో ఓవర్‌లోనే ప్రభ్‌సిమ్రన్ (6) వికెట్ కోల్పోయినా మరో ఓపెనర్ ప్రియాన్స్ (20), మూడో స్థానంలో వచ్చిన జోష్ ఇంగ్లిస్ (38) దూకుడుగా ఆడటంతో ఛేదనను రసవత్తరంగా మార్చేశారు. ఈ ఇద్దరూ రెండో వికెట్‌కు 18 బంతుల్లోనే 42 రన్స్ జోడించారు. కానీ రెండు ఓవర్ల వ్యవధిలో కింగ్స్ ఈ ఇద్దరి వికెట్లను కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే కెప్టెన్ శ్రేయాస్, నెహల్ వధెర ధాటిగా ఆడి కింగ్స్‌ను మళ్లీ గెలుపు రేసులోకి తెచ్చారు. టాప్లీ వేసిన 13వ ఓవర్లో శ్రేయాస్ హ్యాట్రిక్ సిక్సర్లతో రెచ్చిపోతే బౌల్ట్ ఓవర్లో వధెర రెండు బౌండరీలు బాదాడు. కానీ నెహాల్, శశాంక్ (2) వెంట వెంటనే నిష్క్రమించినా అయ్యర్ ధాటిగా ఆడి లాంఛనాన్ని పూర్తిచేశాడు.

సంక్షిప్త స్కోర్లు

ముంబై: 20 ఓవర్లలో 203/6 (తిలక్ 44, సూర్య 44, అజ్మతుల్లా 2/43, స్టోయినిస్ 1/14); **పంజాబ్:** 19 ఓవర్లలో 207/5 (శ్రేయాస్ 87*, వధెర 48, అశ్వని 2/48, హార్దిక్ 1/19)

క్వార్టర్స్‌కు స్వియాటెక్

● పోలోనికి షాకిచ్చిన స్విటోలిన

పారిస్: ప్రతిష్టాత్మక ఫ్రెంచ్ ఓపెన్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియాటెక్ క్వార్టర్స్‌కు దూసుకెళ్లింది. ఐదో సీడ్‌గా బరిలోకి దిగిన ఈ పోలండ్ అమ్మాయి.. ఆదివారం జరిగిన మహిళల సింగిల్స్ ప్రిక్వార్టర్స్‌లో 1-6, 6-3, 7-5తో ఎలీనా రిబాకినా (కజకిస్థాన్)ను ఓడించింది. ఆద్యంతం ఆసక్తికరంగా సాగిన ఈ పోరులో స్వియాటెక్ తొలి సెట్‌ను ఓడినప్పటికీ తర్వాత అద్భుతంగా పుంజుకుని వరుస సెట్‌లతో పాటు మ్యాచ్‌నూ సొంతం చేసుకుంది. క్వార్టర్స్‌లో ఆమె ఎలిన స్విటోలిన (ఉక్రెయిన్)తో తలపడనుంది. మరో పోరులో 13వ సీడ్ స్విటోలిన.. 4-6, 7-6 (8/6), 6-1తో నిరుటి రన్నరప్ జాస్మిన్ పవులోని (ఇటలీ)కి షాకిచ్చింది. ఒకటో సీడ్ సబలెంక.. 7-5, 6-3తో అమండ (యూఎస్)పై అలవోక విజయంతో క్వార్టర్స్‌కు చేరింది. క్వార్టర్స్‌లో ఆమె.. చైనా సంచలనం కిన్వెన్ జెంగ్‌తో అమీతుమీ తేల్చుకోనుంది.

బోపన్న, బాంబ్రీ జోడీల ఓటమి

పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు రోహన్ బోపన్న/ఆడమ్ పవ్లసెక్ (చెక్) ద్వయం.. 2-6, 6-7 (5/7)తో హెన్రీ పాటెన్ (యూకే)/హ్యారీ హెలియోవర (ఫిన్‌లాండ్) చేతిలో ఓడిపోయి మూడోరౌండ్‌కే ఇంటిబాట పట్టింది. మరో మ్యాచ్‌లో యూకీ బాంబ్రీ (భారత్)/రాబర్ట్ (యూఎస్) జోడీ.. 4-6, 4-6తో ఎవాన్ కింగ్/క్రిస్టియన్ హ్యారీసన్ (అమెరికా) ద్వయం చేతిలో ఓడారు.

దీపక్, నమన్‌కు స్వర్ణాలు

థాయ్‌లాండ్ బాక్సింగ్ ఓపెన్

బ్యాంకాక్: థాయ్‌లాండ్ బాక్సింగ్ ఓపెన్‌లో భారత యువ బాక్సర్లు దీపక్, నమన్ తన్వర్ స్వర్ణాలతో మెరిశారు. పురుషుల 75 కిలోల విభాగం ఫైనల్‌లో దీపక్.. 5-0తో జవొఖిర్ (ఉజ్బెకిస్థాన్)పై ఏకపక్ష విజయం సాధించి పసిడి ఒడిసిపట్టాడు. పురుషుల 95 కిలోల ఫైనల్‌లో నమన్.. 4-1తో హాన్ యుయెన్ (చైనా)ను ఓడించి స్వర్ణం కైవసం చేసుకున్నాడు. మహిళల 80+ కిలోల విభాగం ఫైనల్‌లో కిరణ్.. 2-3తో తలిపొవ (కజకిస్థాన్) చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకుంది. మిగిలిన మ్యాచ్‌లలో తమన్నా (51 కిలోలు), ప్రియ (57 కి.), సంజూ (60 కి.), సనేహ్ (70 కి.), లల్ఛక్మవి (80 కి.) కాంస్యాలతో సత్తా చాటారు. మొత్తంగా 19 మందితో ఈ టోర్నీ బరిలో నిలిచిన భారత్.. 8 పతకాలు సాధించడం విశేషం.

చిత్రం

భారీ సెట్‌లో డ్రాగన్ పోరాటాలు?

'దేవర' విడుదలై అప్పుడే తొమ్మిది నెలలు కావొస్తున్నది. కొత్త సినిమా కోసం ఎన్టీఆర్ అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆగస్ట్ 14న బాలీవుడ్ 'వార్ 2'తో తారక్ రాబోతున్న విషయం తెలిసిందే. ఇక సోలో హీరోగా ఆయన నటిస్తున్న చిత్రం 'డ్రాగన్'(వర్కింగ్ టైటిల్). ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో రూపొందుతోన్న ఈ చిత్రం షూటింగ్ కూడా ఓవైపు గప్‌చుప్‌గా జరిగిపోతున్నది. ఇప్పటికే దర్శకుడు ప్రశాంత్‌నీల్ ఈ సినిమాకు సంబంధించిన కొన్ని కీలక సన్నివేశాలను చిత్రీకరించారు. తాజాగా వినిపిస్తున్న అప్‌డేట్ ప్రకారం ఈ నెల 3వ వారం నుంచి కొత్త షెడ్యూల్‌ని మొదలుపెట్టనున్నారట. దీనికోసం బెంగళూర్‌లో ఓ భారీ సెట్‌ని కూడా నిర్మించారట. ఈ సెట్‌లో ఎన్టీఆర్‌పై కీలక సన్నివేశాలను తెరకెక్కిస్తారట. ఈ సీక్వెన్స్‌లో ప్రకాశ్‌రాజ్ కూడా పాల్గొంటారని సమాచారం. సినిమా మొత్తానికి ఈ సన్నివేశాలు మెయిన్ హైలైట్‌గా నిలుస్తాయని తెలుస్తున్నది. ఎన్టీఆర్ కెరీర్‌లోని అత్యుత్తమ చిత్రాల్లో ఒకటిగా 'డ్రాగన్'ను నిలిపేందుకు ప్రశాంత్‌నీల్ ఎంతో శ్రమిస్తున్నారని, స్క్రిప్ట్ కోసం ఆయన ఎక్కువ సమయం తీసుకోవడానికి కారణం కూడా అదేని 'డ్రాగన్' టీమ్ చెబుతున్నది. మైత్రీ మూవీమేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

ఆయనే మాకు స్ఫూర్తి

సుధీర్‌బాబు, సోనాక్షి సిన్హా, శిల్పా శిరోద్కర్ ప్రధాన పాత్రధారులుగా రూపొందుతోన్న సూపర్ నాచురల్ థ్రిల్లర్ 'జాటాధర'. తెలుగు, హిందీ భాషల్లో రూపొందుతున్న ఈ పాన్ ఇండియా చిత్రానికి వెంకట్ కల్యాణ్ దర్శకుడు. ప్రేరణ అరోరా, శివన్ నారంగ్, అరుణ అగర్వాల్ నిర్మాతలు. చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ దశలో ఉంది. మే 31న లెజెండ్రీ నటుడు సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పిస్తూ 'జటాధర' యూనిట్ ఓ పోస్టర్‌ని విడుదల చేసింది. సుదీర్ఘమైన కృష్ణ నట ప్రస్థానాన్ని ఈ సందర్భంగా వాళ్లు గుర్తు చేసుకుంటూ, సూపర్‌స్టార్ మార్గంలోనే తాము కూడా పయనిస్తామని, ఆయనే తామందరికీ స్ఫూర్తి ప్రదాత అని ఓ ప్రకటన ద్వారా తెలియజేశారు. రవిప్రకాష్, ఇంద్రకృష్ణ, నవీన్ నేని, శుభలేఖ సుధాకర్, రాజీవ్ కనకాల, ఝాన్సీ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి అక్షయ్ త్రేజీవాల్, కుస్సుమ్ అరోరా సహా నిర్మాతలు.

ఎస్వీ కృష్ణారెడ్డిదే ఆ ఘనత

ప్రఖ్యాత దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి పుట్టిన రోజు వేడుకలు ఆదివారం హైదరాబాద్‌లో ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మురళీమోహన్, డా.రాజేంద్ర ప్రసాద్, అచ్చిరెడ్డి, శ్రీకాంత్, బ్రహ్మానందం, తనికెళ్ల భరణి, అలీ, శివాజీ రాజా, బండ్ల గణేశ్, గీత రచయిత చంద్రబోస్‌లతో పాటు ఎస్వీ కృష్ణారెడ్డి సినిమాల్లో కథానాయికలుగా నటించిన రోజా, ఆమని, రవళి, ఇంద్రజ, లయ కూడా పాల్గొన్నారు. 32ఏండ్ల కెరీర్‌లో 42 ఎవర్‌గ్రీన్ చిత్రాలను రూపొందించడమే కాక, ఎంతోమంది కళాకారుల జీవితాలకు బలమైన పునాదులు వేసిన ఘనత ఎస్వీకృష్ణారెడ్డిదని వారంతా కొనియాడారు. 'నేను అవకాశాలిచ్చానని వీరంతా చెబుతున్నారు. కానీ వీరంతా స్వతహాగా ప్రతిభామూర్తులు. నా సినిమాలు వారి ప్రతిభను ప్రేక్షకులకు మరింత చేరువ చేశాయి. అంతేకానీ వారికి నేను ప్రత్యేకంగా చేసిందేం లేదు.' అని ఎస్వీకృష్ణారెడ్డి పేర్కొన్నారు.

హీరోయిన్లు ఆటబొమ్మలు కాదు

నిత్యామీనన్‌కి కోపం వచ్చింది. తన సోషల్ మీడియా ద్వారా నెటిజన్స్‌కి లెఫ్ట్ అండ్ రైట్ ఇచ్చేసింది. వివరాల్లోకెళ్తే.. రీసెంట్‌గా ఈ అందాలభామ ఓ సినిమా వేడుకకు హాజరైంది. అక్కడ ఓ అభిమాని నిత్యకు షేక్‌హ్యాండ్ ఇవ్వడానికి ట్రై చేశాడు. కానీ నిత్యామీనన్ మాత్రం అతనికి షేక్‌హ్యాండ్ ఇవ్వకుండా, నమస్కారం చేసి, 'నాకు జలుబు చేసింది..' అని తప్పుకుంది. కానీ డయాస్ మీదకు వెళ్లగానే అక్కడున్న హీరోకు హగ్ ఇచ్చేసింది. ఈ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తూ నెటిజన్లు నిత్యామీనన్‌ని ఓ రేంజ్‌లో ట్రోల్ చేశారు. దాంతో ఈ బొద్దుగుమ్మకు చిర్రెత్తుకొచ్చింది. వెంటనే తన సోషల్ మీడియా ద్వారా ఈ విషయంపై క్లారిటీ ఇస్తూ.. తన శైలిలో సమాధానమిచ్చింది. 'సినిమా హీరోయిన్లను సగటు మహిళల్లా చూడడం చాలామంది మగాళ్లకు తెలీదు. హీరోయిన్లంటే ఈజీగా టచ్ చేయొచ్చని అనుకుంటారు. సాధారణ మహిళలను ఎందుకు షేక్ హ్యాండ్ అడగరు? మమ్మల్నే ఎందుకు అడుగుతారు? ఈజీగా ముట్టుకోడానికి హీరోయిన్లే మైనా ఆట బొమ్మలా? ' అంటూ ఫైర్ అయ్యింది నిత్యామీనన్.

వర్క్ మోడ్‌లో రెబల్‌స్టార్

ప్రస్తుతం ప్రభాస్ వర్క్ మోడ్‌లో ఉన్నారు. రీసెంట్‌గా 'స్పిరిట్' సినిమా స్క్రిప్ట్ డిస్కషన్‌లో పాల్గొన్న ఆయన, ఈ వారంలోనే 'ది రాజా సాబ్'లోని తన పాత్రకు డబ్బింగ్ చెప్పనున్నారు. ఇది పాన్ ఇండియా సినిమా కావడంతో హిందీ వెర్షన్‌కి కూడా ప్రభాసే డబ్బింగ్ చెప్పనున్నారట. ప్రస్తుతం ఓ వైపు షూటింగ్‌తో మరో వైపు పోస్ట్ ప్రొడక్షన్ వర్క్‌తో 'ది రాజాసాబ్' యూనిట్ బిజీగా ఉంది. త్వరలోనే ప్రమోషన్స్ కూడా స్టార్ట్ చేస్తారట. ఇదిలావుంటే ప్రభాస్ నటిస్తున్న మరో పాన్ ఇండియా ప్రాజెక్ట్ 'స్పిరిట్' సినిమా విషయంలో ఓ ఆసక్తికరమైన అప్‌డేట్ వెలుగు చూసింది. పవర్‌పుల్ కాప్ స్టోరీగా రూపొందుతోన్న ఈ చిత్రంలో ఓ క్రేజీ ఫ్లాష్‌బ్యాక్ కూడా ఉంటుందట. సినిమా సెకండాఫ్‌లో వచ్చే ఈ ఫ్లాష్‌బ్యాక్‌లో ప్రభాస్ పాత్ర మాఫియా నేపథ్యంలో సాగుతుందని తెలుస్తున్నది. ఈ స్క్రిప్ట్ విషయంలో ప్రభాస్ ఫుల్ ఖుషీగా ఉన్నారట. త్వరలోనే 'స్పిరిట్' షూటింగ్‌ను మొదలుపెట్టనున్నారు దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా. ఇందులో కథానాయికగా త్రిప్తి డిమ్రీ ఎంపికైక విషయం విదితమే. వచ్చే ఏడాది ఈ సినిమా విడుదల అవుతుంది.

పాడేరు 12వ మైలు

సత్యం రాజేష్, శ్రవణ్, కాలకేయ ప్రభాకర్ ప్రధాన పాత్రల్లో రూపొందిన సస్పెన్స్ థ్రిల్లర్ 'పాడేరు 12వ మైలు'. సుహాన కథానాయిక. ఎన్.కె. దర్శకత్వంలో గ్రంధి త్రినాథ్ ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 6న సినిమా విడుదల కానుంది. సస్పెన్స్‌తోపాటు లవ్ ఎలిమెంట్స్ కూడా ఈ సినిమాలో ఉంటాయని, అన్ని వర్గాలకు నచ్చేలా సినిమా ఉంటుందని దర్శకుడు ఎన్.కె తెలిపారు. సినిమా చాలా బాగా వచ్చిందని, తప్పకుండా ఆడియన్స్ బాగా రిసీవ్ చేసుకుంటారనే నమ్మకం ఉందని నిర్మాత గ్రంధి త్రినాథ్ ఆశాభావం వ్యక్తం చేశారు. గడ్డం నవీన్, షేకింగ్ శేషు, ముకేష్ గుప్తా, కె.ఏ.పాల్‌రాము, సూర్య, సమీర్ చిట్టిబాబు, మురళి తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: జి.అమర్.

గ్లామర్, కామెడీ, మిస్టరీ కలబోతగా..

మ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాలతో మంచి పేరు తెచ్చుకున్న సంగీత్ శోభన్ కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం 'గ్యాంబ్లర్స్'. ప్రశాంతి చారులింగా కథానాయిక. కేఎస్‌కే చైతన్య దర్శకుడు. సునీత, రాజ్‌కుమార్ బృందావనం నిర్మాతలు. నిర్మాణానంతర కార్యక్రమాలు చివరి దశకు చేరుకున్న ఈ సినిమా, ఈ నెల 6న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేశారు. నిర్మాతల్లో ఒకరైన రాజ్‌కుమార్ బృందావనం మాట్లాడుతూ 'వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో ఈ సినిమా నిర్మించాం. అన్ని వర్గాలను అలరించే అంశాలు ఇందులో ఉంటాయి.' అని తెలిపారు. అన్ని ఎమోషన్స్నూ ఉన్న యూత్‌ఫుల్ ఎంటర్టైనర్ ఇదని, ఇందులో నటుడిగా సంగీత్ శోభన్‌లోని కొత్త కోణాన్ని చూస్తారని, ప్రతి అంశం థ్రిల్లింగ్‌గా ఉంటుందని, మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నైజం విడుదల చేస్తున్నదని మరో నిర్మాత సునీత చెప్పారు. గ్లామర్, కామెడీ, మిస్టరీ కలబోతగా ఈ సినిమా ఉంటుందని దర్శకుడు కేఎస్‌కే తెలిపారు. రాకింగ్ రాకేష్, పృథ్వీరాజ్ బన్న, సాయిశ్వేత, జస్విక, తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: ప్రేమ్ సాగర్, సంగీతం: శశాంక్ తిరుపతి.

శక్తివంతమైన నేపథ్యాలతో

స్వయంభు

'కార్తికేయ 2'తో పానిండియా విజయాన్ని అందుకున్న హీరో నిఖిల్ నటిస్తున్న మరో పానిండియా హిస్టారిక్ యాక్షన్ ఎపిక్ 'స్వయంభు'. లెజెండరీ యోధునిగా ఇందులో నిఖిల్ కనిపించనున్నారు. భరత్ కృష్ణమాచారి దర్శకుడు. భువన్, శ్రీకర్ నిర్మాతలు. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ దశలో ఉంది. నిఖిల్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం ఈ సినిమాకు సంబంధించిన పవర్‌పుల్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. నిఖిల్, సంయుక్త మీనన్ యుద్ధం చేస్తూ ఈ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. సినిమా గ్రాండ్ స్కేల్‌ని ప్రజెంట్ చేసేలా ఈ పోస్టర్ ఉన్నది. న్యాయమైన నాయకత్వానికి ఉదాహరణగా, నీతిమంతమైన పాలనకు చిహ్నంగా నిలిచిన సెంగోల్ ఈ పోస్టర్ నేపథ్యంలో కనిపించడం ఆసక్తికరంగా ఉంది. ఇటీవల ప్రధాని నరేంద్ర మోడి సైతం భారతీయ వారసత్వానికి నివాళుల ర్పిస్తూ కొత్త పార్లమెంట్ భవనంలోని స్పీకర్ సీటు దగ్గర ఈ సెంగోల్‌ను ప్రతిష్టించారని నిర్మాతలు గుర్తు చేశారు. అద్భుతమైన కథతో శక్తివంతమైన నేపథ్యాల చుట్టూ ఈ కథ నడుస్తుందని మేకర్స్ తెలిపారు. నభా నటేష్ మరో కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి మాటలు: విజయ్ కామిశెట్టి, కెమెరా: కె.కె.సెంథిల్ కుమార్, సంగీతం: రవి బస్రూర్, సమర్పణ: ఠాగూర్ మధు, నిర్మాణం: పిక్సెల్ స్టూడియోస్.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.